క్లుప్తంగా

ముగిసిన చదరంగం పోటీలు

కర్నూలు (టౌన్): రెండు రోజుల పాటు స్థానిక ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్- 7, అండర్-9 బాలబాలికల చదరంగం పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి కప్పులు అందజేసి అభినందించారు. విజేతలుగా అండర్-7 బాలుర విభాగంలో షవాజ్ రాజ్, వేదేశ్, బాలికల విభాగంలో హన్విత, రిత్వి, అండర్-9 బాలుర విభాగంలో హేమనందన్ నాయక్, అభికేశవ్, బాలికల విభాగంలో కమతం వెంకట రిత్విక, అకాంక్షిత రెడ్డి నిలిచారు. ఆర్గనైజర్ రవి నాయక్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని జిల్లా మాస్ మీడియా అధికారి (డెమో) శ్రీనివాసులుశెట్టి చెప్పారు. సోమవారం నగర శివారులోని రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో సీజనల్ వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల వర్షాలకు నీరు కలుషితం కావడం వల్ల ప్రజలకు వాంతులు, విరేచనాలు మొదలై అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. నీటిని కాచి చల్లార్చి, వడబోసి తాగాలని, భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఇళ్లు, పరిసరాల్లో దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు. శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి ఫర్వీన్ తబస్సుం, ఏఎంఓ చంద్రశేఖర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు సోమవారం కర్నూలు రూరల్ మండల విద్యాధికారి వినోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. జీఓ ఎంఎస్ నంబరు 117ను రద్దు చేయాలని, జీఓ నంబరు 55 ప్రకారం ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆ సంఘం మండల విభాగం అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

స్పీక్ ఈజీ క్లబ్ ప్రారంభం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

కర్నూలు సిటీ: రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో స్పీక్ ఈజీ క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ సౌత్ ఆసియా హెడ్ సురేష్ నారాయణన్, మేనేజర్ మల్లికార్జుననాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ స్పీక్ ఈజీ క్లబ్ వల్ల విద్యార్థులకు అనేక కొత్త అంశాల గురించి తెలుసుకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. కేంబ్రిడ్జ్ వర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ పరీక్ష విధానం, సర్టిఫికేషన్ ప్రాముఖ్యతను వివరించారు. రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జి.వి.ఎం.మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. కేంబ్రిడ్జ్ ప్రెస్ అండ్ అసెస్మెంట్ సర్టిఫికేషన్‌లో జి.పుల్లయ్య, రవీంద్ర ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన 350 మంది విద్యార్థులు సర్టిఫికెట్లు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. స్పీక్ ఈజీ క్లబ్ యాక్టివిటీల్లో ప్రతి విద్యార్థి పాల్గొనాలని సూచించారు. అనంతరం రవీంద్ర కాలేజీ, కేంబ్రిడ్జ్ వర్సిటీ మధ్య అభ్యసన భాగస్వాముల ఒప్పందాలను మార్చుకున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై ధర్నా

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పరిధిలోని జొహరాపురం బుడన్‌ఖాన్ మసీదు స్థలాలకు సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ సుభాన్, మాజీ మంత్రి మారెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వక్ఫ్ భూములను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ఎస్‌ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సినారే సాహిత్యం అజరామరం

కర్నూలు సిటీ: అభ్యుదయ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సినారే సాహిత్యం అజరామరం అని రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు హనుమంతప్ప అన్నారు. సోమవారం అరసం కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక సలాంఖాన్ భవనంలో సినారే జయంతి నిర్వహించారు. వక్తలు సినారే సాహిత్య దృక్పథాన్ని కొనియాడారు. అరసం నగర ప్రధాన కార్యదర్శి ప్రమోద్ చక్రవర్తి, సభ్యులు పవన్, లత, దాసరి, రమణ, డాక్టర్ తిరుపతి, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): వచ్చే నెల 4, 5 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మెమోరియల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ చాటాలని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి సూచించారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన పంచలింగాల కేజీబీవీకి చెందిన అనూష, ఉదయలక్ష్మి, దీపిక, స్రవంతి, మమతలను సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర సహాయక కార్యదర్శి నవీన్ ఉన్నారు.

వీధికుక్కలతో జరభద్రం

- ఉమ్మడి జిల్లాలో కర్నూలులో మాత్రమే వీధికుక్కల సంతాన నియంత్రణకు చర్యలు
- మిగతా ప్రాంతాల్లో కానరాని శస్త్రచికిత్సలు
- పెరిగిపోతున్న కుక్క కాటు కేసులు
- తగిన జాగ్రత్తలతో కుక్క కాటును తప్పించుకునేందుకు అవకాశం



నగరంలో సంచరిస్తున్న వీధికుక్కలు

కర్నూలు(అగ్రికల్చర్): వీధి కుక్కల సంతాన నియంత్రణ కార్యక్రమాలు తూతూ మంత్రం అయ్యాయి. కర్నూలు నగరంతో పాటు మున్సిపాలిటీలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. కుక్కలు మనుషులను కరవడం ద్వారా ప్రమాదకరమైన రేబిస్ వ్యాధి ప్రబలుతోంది. వీధి కుక్కల సంతతిని అరికట్టడంతోపాటు రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాల్సి ఉన్నా.. ఈ దిశగా చర్యలు లేవు. ఏడాదికేడాది కుక్కకాటు కేసులు పెరుగుతున్నాయి. అదే సమయంలో రేబిస్ మరణాలు కూడా పెరుగుతున్నాయి. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాలు జరుగుతున్నా మిగతా ఎక్కడా ఈ కార్యక్రమాలు జరుగుడం లేదు. వీధి కుక్కలను పట్టించుకునే వారు లేకపోవడంతో వీటి సంతతి పెరిగిపోతోంది. కర్నూలు నగరంలో 11,978 వీధి కుక్కలను గుర్తించారు. ఇందులో ఇప్పటివరకు 9,341 కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు తెలుస్తోంది. ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, గూడూరు, డోన్, బనగానపల్లి, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికోట్కూరు, బేతంచెర్ల, నందికోట్కూరు పట్టణాల్లో వీధి కుక్కల గురించి పట్టించుకునే వారు లేరు. దీంతో పట్టణాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

కుక్క కాటేస్తే తీసుకోవాల్సిన చర్యలు

కుక్క కరిచిన చోట కుళాయి లేదా చెంబుతో నీటి ధార పోస్తూ సబ్బుతో పది నిముషాలు కడగాలి. లైఫ్‌బాయ్ సబ్బు అయితే మంచిది. డెటాల్, బెటాడిన్ లేదా గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. పిచ్చి కుక్క అయితే మాత్రం వెంటనే రేబిస్ టీకాలు వేయించాలి. గాయాన్ని రుద్ది కడగరాదు. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయకూడదు. గాయానికి కట్లు వేయడం, గట్టిగా నొక్కడం చేయరాదు.

వీధి కుక్కల సంతాన నియంత్రణ వల్ల ఉపయోగాలు...

వీధి కుక్కల సంతతిని తగ్గించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉంది. గ్రామాల్లో పంచాయతీలు, పట్టణాల్లో మున్సిపాలిటీలు, నగరాల్లో కార్పొరేషన్‌లపై వీధి కుక్కల నియంత్రించాల్సిన బాధ్యత ఉంది. ఇందువల్ల వీధి సంఖ్య తగ్గుతుంది. ఆపరేషన్ అయిన కుక్కలు ఆరోగ్యంగా ఉంటాయి. ఎటుపడితే అటు తిరగడం పోట్లాడటానికి ఇష్టపడవు. జనన నియంత్రణ చేయబడిన కుక్కలు కరవడం చాలా తక్కువ. మనకు ఉచితంగా రక్షక భటులుగాను, పరిశుభ్రకులుగాను పనిచేస్తాయి. 75 శాతం వీధి కుక్కలకు రేబిస్ టీకాలు వేయడం వల్ల ఆ ప్రాంతాన్ని రేబిస్ రహితంగా మార్చవచ్చు. చెవిని కత్తరించి Λఆకారంలో ఉంటే ఆపరేషన్ అయిందని గుర్తు.

పెరుగుతున్న పెంపుడు కుక్కల పెంపకం

నేడు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ పెంపుడు కుక్కల పెంపకం ఎక్కువగా ఉంటోంది. ప్రధానంగా ఇంటికి రక్షణ కోసం మేలు జాతి కుక్కలను పోషిస్తున్నారు. కొంతమందికి కుక్కల పెంపకం హాబీగా మారింది. కర్నూలులోని బహుళార్థ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ప్రత్యేక చికిత్స అందిస్తుండటం విశేషం. వీటికి తప్పనిసరిగా 3 నెలల వయస్సులో టీకాలతో పాటు ఏటా బూస్టర్ డోస్ వేయించాలి. పెంపుడు కుక్కలకు విధిగా సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలి.

పక్కాగా శస్త్రచికిత్సలు



కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చురుగ్గా జరుగుతున్నాయి. నవోదయ వెట్ సొసైటీ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. రోజుకు ఎన్ని కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. ఆపరేషన్ అయిన తర్వాత వాటి పరిస్థితి ఎలా ఉంది. తదితర వాటిని పర్యవేక్షిస్తున్నాం. రోజుకు సగటున 10 నుంచి 20 వరకు వీధి కుక్కలకు గార్గేయపురం సమీపంలోని డంప్ యార్డు వద్ద నిర్మించిన కేంద్రంలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 9 వేలకు పైగా శస్త్ర చికిత్సలు నిర్వహించాం. – డాక్టర్ మల్లన్న, వెటర్నరీ ఆఫీసర్, కర్నూలు

కుక్క కాటు నుంచి ఇలా తప్పించుకోవచ్చు

- కుక్క దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండడం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోను పరుగెత్తరాదు. కుక్కల కళ్లలోకి తదేకంగా చూడరాదు. కుక్క పిల్లల దగ్గరికి వెళ్లరాదు. తల్లి కుక్క దాడిచేసే ప్రమాదం ఉంటుంది.
- నిద్రిస్తున్నపుడు, తింటున్నపుడు, పిల్లలకు పాలిస్తున్నపుడు కుక్కలను కర్రలు, రాళ్లతో అదిలించడం వంటివి చేయరాదు.
- కుక్క దాడి చేస్తే ముఖాన్ని పంచె లేదా తువ్వాలు వంటి వాటితో కప్పుకోవాలి. ఏమీ లేకపోతే చొక్కానుపైకి జరుపుకోవాలి.లేదా ముఖాన్ని చేతులతో కప్పుకోవాలి. ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్ త్వరగా మెదడుకు సోకుతుంది.
- కుక్క కోపంగా మీదకు వస్తే నేల వైపు చూస్తూ కుక్కకు దూరంగా మెల్లగా నడవాలి.

చేయకూడనివి...

- మిగిలిపోయిన ఆహారం, ఎముకలు వంటివి ఎక్కడపడితే అక్కడ వేయరాదు. తిండి దొరికినంత కాలం వీధుల్లో కుక్కల సంతానం వృద్ధి చెందుతునే ఉంటుంది. పెంపుడు కుక్కలను వీధుల్లోకి వదలరాదు. వీధికుక్కలతో పెంపుడు కుక్కలను కలవనీయరాదు. పెంపుడు కుక్కలను ఇళ్లలో ఎల్లపుడూ కట్టి ఉంచరాదు. దీనివల్ల వాటిలో ఆగ్రహం పెరుగుతుంది. వీధి కుక్కలు వెంబడించినపుడు బైకు, సైకిల్ వేగం పెంచరాదు.

మొక్కల పెంపకంతోనే మనుగడ



మొక్కను నాటిన సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి

కర్నూలు (సిటీ): మొక్కలు నాంటి పెంచడమే భవిష్యత్తు తరాలకు అందించే గొప్ప బహుమతి అని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు.. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాలలో 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజేంద్ర చౌధురి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కర్నూలు ఆలిండియా రేడియో ప్రోగ్రామ్ హెడ్ డి.మురళి మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు మెరుగైన పర్యావరణంతో కూడిన భూమిని అందించడం మనందరి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సెల్ఫీ చిత్రాలను 'ప్లాంట్4మదర్', 'ఏక్ పేడ్ మా కె నామ్' హ్యాష్‌ట్యాగ్‌లతో సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలన్నారు. కర్నూలు క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, ప్రిన్సిపాల్ డాక్టర్ శంత, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 31న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జూనియర్ సాఫ్ట్‌బాల్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి విజయ్ సోమవారం తెలిపారు. 2007 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, ఎంపికైనవారు వచ్చే నెల 17 నుంచి 19 వరకు శ్రీకాకుళం జిల్లాలో జరగనున్న 11 వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 70320 88008 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పీజీఆర్ఎస్‌లో వినతుల వెల్లువ



నగరపాలక ఎస్ఈ వేణుగోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కర్నూలు (టౌన్): నగర పరిధిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక ఎస్ఈ వేణుగోపాల్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. పలువురు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ఆర్ఓ జునీద్, డీసీపీ సంధ్యారాణి, టిడ్కో అధికారి పెంచలయ్య, డీపీఓ ఉమేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని....

- ధర్మపేటలో సామూహిక మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. 5 నెలల క్రితం వీటిని ఏర్పాటు చేసినా అప్పుడే దెబ్బతిన్నాయని ధర్మపేట ఏరియా వాసుల సంక్షేమ సంఘం నాయకులు రాజు విన్నవించారు.
- టిడ్కో ఇంటి కోసం కట్టిన డీడీ నగదును వెనక్కి ఇవ్వాలని గరీబ్ నగర్‌కు చెందిన బషీరున్నిసా వినతిపత్రం ఇచ్చారు.
- తన ఇంటి స్థలంలో డ్రైనేజీ కాల్వ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారని శ్రీనివాసనగర్‌కు చెందినవెంకట ప్రసాద్ ఫిర్యాదు చేశారు.
- మాంసం విక్రయదారులు వ్యర్థాలను డ్రైనేజీ కాల్వలో పడేస్తున్నారని అరోరానగర్‌కు చెందిన రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు చేశారు.
- టిడ్కో ఇళ్లకు నగదు చెల్లించిన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు.
- పెద్ద మార్కెట్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ముందు పశువులను ఉంచి అపరిశుభ్రం చేస్తున్నారని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు తెలుగు విజయ్‌కుమార్, ఉమ్మన్న ఫిర్యాదు చేశారు.
- గాయత్రి ఎస్టేట్‌లోని ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు విజయనాయుడు, రాధ వేర్వేరుగా వినతిపత్రాలు ఇచ్చారు.
- విష్ణు టౌన్ షిప్‌లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని ఆ కాలనీ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు సుధాకర్ విన్నవించారు.
- మామిదాలపాడు, గీతాముఖర్జీ నగర్, స్టాంటన్‌పురం కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానిక టీడీపీ నాయకులు పరమేశ్వర రెడ్డి విన్నవించారు.

వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి



మేయర్ రామయ్యకు వినతిపత్రం ఇస్తున్న వలంటీర్లు

కర్నూలు (టౌన్): అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వలంటీర్ల అసోసియేషన్ జిల్లా కన్వీనర్ సుకన్య విన్నవించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో మేయర్ బీవై రామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గత మూడు నెలలుగా వలంటీర్లకు వేతనాలు నిలిచిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. వలంటీర్ల అసోసియేషన్ సభ్యులు అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీ ఇవ్వడంలో ఆలస్యం చేయొద్దు



ఆసుపత్రిలో పర్యటిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు ఓపీ ఇవ్వడంలో ఆలస్యం చేయవద్దని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం ఆసుపత్రిలో పలు విభాగాలను తనిఖీ చేశారు. ఓపీ కౌంటర్ వద్ద రోగుల రద్దీని గమనించి త్వరగా ఓపీ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్జికల్ వార్డు వద్ద ఓపెన్ డ్రైన్లను మూసివేయాలన్నారు. ఎంఆర్ఐ కేంద్రం వద్ద కొత్త టైల్స్ వేయాలని సూచించారు. క్యాజువాలిటీలో ఒకే మంచంపై ఇద్దరు రోగులను పడుకోబెట్టడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులను కొత్త క్యాజువాలిటీలోకి తరలించాలని సీఎంఓకు చెప్పారు. ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ రామశివ నాయక్, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, రవికుమార్, నవీన్ పాటిల్ తదితరులు సోమవారం డీఈఓ కె.శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. ఆ సంఘం నాయకులు హేమంత్‌కుమార్, యోహోషువ, తిమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

లాబ్ అటెండెంట్ మృతి



లింగస్వామి (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ల్యాబ్ అటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.లింగస్వామి సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం ఉదయం గుండెపోటుకు గురైన ఆయన్ను కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మృతికి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సంతాపం తెలిపారు. మట్టిఖర్చులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.25 వేల మొత్తాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

పట్టపగలే చైన్‌స్నాచింగ్

కర్నూలు: స్థానిక శ్రీరాంనగర్‌లో పట్టపగలే చైన్‌స్నాచర్ రెచ్చిపోయాడు. వివరాలు.. గణేష్‌నగర్‌లో నివాసముంటున్న హేమసాయి శ్రీరాంనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తోంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భోజనం చేసేందుకు ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై ఆమెను సమీపించి మెడలో ఉన్న 4 తులాల పుస్తెల గొలుసును లాక్కుని ఉడాయించాడు. గొలుసును గట్టిగా లాగడంతో మెడ వద్ద కోసుకుపోయింది. బాధితురాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సబ్‌రిజిస్ట్రార్ నియామకం

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా ఎన్.అబ్దుల్ రఫాయి ఫిరోజ్‌ను నియమించారు. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ పనిచేసిన జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ విధి నిర్వహణలో అలసత్వం, అక్రమాలకు పాల్పడడంతో రెండు రోజుల క్రితం సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో ఎన్.అబ్దుల్ రఫాయి ఫిరోజ్‌ను నియమించారు. ఫిరోజ్ ప్రస్తుతం బేతంచెర్లలో డెప్యూటేషన్‌పై ఎస్ఆర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఒరిజినల్ స్థానం మాత్రం ప్యాపిలి. ఇదిలాఉండగా కర్నూలు జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్ పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉండడం గమనార్హం.

ట్రాఫిక్ పోలీసుల విస్తృత తనిఖీలు

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా సీఐ గౌతమి నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు బృందాలుగా ఏర్పడి సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఐదు రోడ్ల కూడలిలో తనిఖీ చేపట్టి రికార్డులు సక్రమంగా లేని పది ఆటోలను సీజ్ చేసి ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. వినాయక ఘాట్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో మధ్యాహ్నం ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి సుమారు 20 మంది వ్యాపారులపై పిటీ కేసులు నమోదు చేసి వ్యాపార సామగ్రిని స్టేషన్‌కు తరలించారు. వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రాజ్‌విహార్, మౌర్య ఇన్ జంక్షన్ ప్రాంతాల్లో తనిఖీ చేపట్టి మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లను గుర్తించి పది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మంగళవారం వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు సీఐ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పెనుకొండ: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై 'వై' జంక్షన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి లారీని ఆర్టీసీ బస్సు ఢీ కొన్న సంఘటనలో 9 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు ఇలా... కర్నూలు జిల్లా ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సు 16 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి శ్రీశైలానికి బయలుదేరింది. ఆదివారం అర్ధరాత్రి పెనుకొండ 'వై' జంక్షన్ వద్దకు చేరుకుంది. ఆ సమయంలో రోడ్డు దాటుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న ముస్తాక్, కర్నూలుకు చెందిన గురుప్రసాద్, సావిత్రి, స్వాతి, లారీ డ్రైవర్ నల్లప్ప మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందుభాగం బాగా దెబ్బతినగా డ్రైవర్ వెంకటేశ్వర్లు వాహనంలోనే ఇరుక్కుపోయాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు అతికష్టమ్మీద అతన్ని బయటకు తీశారు. క్షతగాత్రులందరినీ పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు జయనాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేతనాల కోసం ఆగస్టు 5న ఎంఈఓ కార్యాలయాలు, 12న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

పెరుగుతున్న హెపటైటిస్ మరణాలు



ప్రచార కరపత్రాలు ప్రదర్శిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచవ్యాప్తంగా హెపటైటిస్ మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. హెపటైటిస్‌ను ఎదుర్కొనేందుకు తక్షణ, నిర్ణయాత్మక చర్యల అవసరం ఏర్పడిందన్నారు. ఈ వ్యాధితో ప్రతి 30 సెకన్లకు ఒకరు మరణిస్తున్నారని, వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు వివరించారు. హెపటైటిస్ అనేది కాలేయం వాపు అని, ఇది తరచూ వైరల్ ఇన్‌ఫెక్షన్లు, మద్యం సేవించడం, కొన్ని మందులు, స్వయం ప్రతిరక్షణ వ్యాధుల వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధిపై అవగాహన పెంచుకుని ప్రజలను చైతన్యపరచాలని వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా ఎయిడ్స్, లెప్రసి, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ హేమలత, డీపీఎంఓ డాక్టర్ ఉమ, మలేరియా అధికారి నూకరాజు, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి, డెమో శ్రీనివాసులుశెట్టి పాల్గొన్నారు.

'శ్రీకృష్ణ కమల పాలిక' నాటకానికి పురస్కారం

కర్నూలు కల్చరల్: జాతీయ స్థాయి నాటక ప్రదర్శన పోటీల్లో 'శ్రీకృష్ణ కమల పాలిక' పద్య నాటకం ద్వితీయ ఉత్తమ ప్రదర్శన అవార్డును కైవసం చేసుకుందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య వెల్లడించారు. సోమవారం సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆయన మాట్లాడుతూ.. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో పల్లేటి కులశేఖర్ రచన, పత్తి ఓబులయ్య దర్శకత్వంలో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కమలపాలిక' నాటకం ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచిందని తెలిపారు. దీంతో పాటు కళాకారులు ఆరు వ్యక్తిగత పురస్కారాలను కైవసం చేసుకున్నారని చెప్పారు. ఉత్తమ నటిగా సురభి ప్రభావతి, ఉత్తమ హాస్యనటిగా హసీనా, ఉత్తమ గాయకులుగా జి.వి. శ్రీనివాసరెడ్డి, ఉత్తమ ఆహార్యం సి.శ్రీనివాసులు, ప్రత్యేక జ్యూరీ అవార్డు ఆర్.శామ్యూల్, పి.రాజారత్నం అవార్డులను సొంతం చేసుకున్నారన్నారు. ఇదిలాఉండగా ఆగస్టు 3న సాయంత్రం 6 గంటలకు టీజీవీ కళాక్షేత్రం శాశ్వత సభ్యుల సమావేశం ఉంటుందని సభ్యులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కళాకారులు ఆంజనేయులు, పాండురంగయ్య, లక్ష్మన్న, లక్ష్మీకాంతరావు, పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఇసుక తరలింపు

కర్నూలు: కర్నూలు మండలం మునగాలపాడు పంప్ హౌస్ ప్రాంతంలో డంప్ చేసిన ఇసుకను సెబ్ అధికారులు సీజ్ చేశారు. మైన్స్ అండ్ జియాలజీ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం దాదాపు 540 టన్నుల అక్రమ ఇసుకను 21 టిప్పర్లు, రెండు జేసీబీల సహాయంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాల పనుల నిమిత్తం తరలించారు. మునగాలపాడులోని కొందరు యువకులు తుంగభద్ర నది నుంచి ఇసుకను తోడి గ్రామ శివారులోని పంప్‌హౌస్ వద్ద డంప్ చేసి రాత్రివేళల్లో కర్నూలు నగరానికి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం అందడంతో సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి ఇసుకను గత వారం సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిక్ట్ లెవల్ శాండ్ కమిటీ చైర్మన్/జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు సెబ్ అధికారులు సీజ్ చేసిన ఇసుకను సోమవారం టిప్పర్లలో ప్రభుత్వ పనులకు తరలించారు. ట్రైనీ ఏఈఎస్ హర్ష, మారుతీప్రసాద్, ఎస్ఐ మురహరి, పీరయ్య, ఎస్ఐ మాదప్ప, ఏఆర్ఎస్ఐ మోహన్, మునగాలపాడు వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగికి ఉచితంగా ఖరీదైన ఇంజెక్షన్



రామాంజనేయులుకు చికిత్స అందిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటుతో వచ్చిన రోగికి సకాలంలో ఖరీదైన ఇంజెక్షన్ వేసి అతని ప్రాణాలు నిలిపారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాలిటీ వైద్యులు. నంద్యాల జిల్లా డోన్ మండలం మిద్దేపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు(62) గుండెనొప్పితో సోమవారం ఉదయం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్(క్యాజువాలిటీ)కి వచ్చారు. అక్కడి వైద్యులు, హెచ్‌వోడీ డాక్టర్ రామశివనాయక్ వెంటనే రోగికి ఈసీజీ తీయించారు. అందులో గుండెపోటు వచ్చిందని నిర్ధారించి రూ.49వేల ఖరీదైన 40ఎంజీ ఎలక్జిమ్ ఇంజెక్షన్‌ను వేశారు. 45 నిమిషాల తర్వాత రోగికి మళ్లీ ఈసీజీ తీయించి అందులో మార్పులను చూసి గుండెజబ్బుల వార్డులో అడ్మిట్ చేశారు. సకాలంలో స్పందించిన వైద్యుల పట్ల రోగి కుటుంబసభ్యులు నాగలక్ష్మి, సురేష్ హర్షం వ్యక్తం చేశారు. చికిత్స అందించిన వారిలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫయాజ్, జనరల్ మెడిసిన్ పీజీ, ఈసీజీ టెక్నీషియన్ సోమశేఖర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ దినేష్, సుధాకర్ ఉన్నారు.